తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

ఎడిటర్: బక్క రవీందర్

మంగళవారం 20, ఆగస్టు 2024


మంకీపాక్స్ కట్టడికి ఆసుపత్రులలో ఎమర్జెన్సీ వార్డులు 2లో


సమస్య ఏదైనా

దాని వెనుక ఎవరున్నా....
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707




## క్రీడలకు కేంద్ర బిందువుగా తెలంగాణ - సీఎం రేవంత్

హైదరాబాద్ : దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు.

- ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో క్రీడా పాఠశాల
- వాటన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకు రావాలి
- ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై సమీక్ష
- దేశ క్రీడా రంగానికి తెలంగాణ కేంద్రబిందువుగా ఉండాలన్న సీఎం
- భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలన్న సీఎం



మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మిగతా 2లో

## మరోసారి విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ..

- ఈ నెల 23న జెలెన్ స్కీతో కీలక భేటీ
- పోలెండ్‌లో పర్యటించనున్న మోదీ
- అనంతరం ఉక్రెయిన్‌లో పర్యటన
- 30 ఏళ్ల తర్వాత ఉక్రెయిన్‌కు భారత ప్రధాని



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఆయన రేపు, ఎల్లుండి యూరోపియన్ దేశం పోలెండ్ లో పర్యటించనున్నారు. ఓ భారత ప్రధాని పోలెండ్ పర్యటనకు వెళుతుండడం 45 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం. మధ్య యూరప్ దేశాల్లో పోలెండ్ దేశం భారత్ కు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. పోలెండ్ కు కు చెందిన దాదాపు 30 కంపెనీలు భారత్ లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. అటు, పోలెండ్ లో భారత్ కు చెందిన 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక, పోలెండ్ పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఈ నెల 23న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్ స్కీతో మోదీ భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఏడాదిన్నర కాలంగా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్న నేపథ్యంలో, మోదీ పర్యటనపై అందరి దృష్టి కేంద్రీకృతం కానుంది. చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ ఎప్పటినుంచో చెబుతోంది. ఇప్పుడు మోదీ కూడా జెలెన్ స్కీతో సమావేశంలో అదే వైఖరికి కట్టుబడి ఉండే అవకాశాలున్నాయి. ఓ భారత ప్రధాని ఉక్రెయిన్ లో పర్యటించనుండడం 30 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల21న పోలెండ్‌ను, రెండు రోజుల తరువాత 23న యుద్ధ సంక్షుభిత ఉక్రెయిన్‌ను సందర్శిస్తారని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) సోమవారం ప్రకటించింది. ఎంఇఎలో పశ్చిమ విభాగం కార్యదర్శి తన్మయ లాల్ ఈ ప్రకటన చేశారు. భారత ప్రధాని ఒకరు 45 ఏళ్లలో పోలెండ్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. ఉభయ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 70 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ పర్యటన చోటు మిగతా 2లో

## భారీ వర్షానికి భాగ్యనగరం విలవిల

- రెండు గంటల పాటు ఏకదాటిగా వాన
- నీట మునిగిన పలు ప్రాంతాలు
- చెరువులుగా మారిన రహదారులు
- జనజీవనం అస్థవ్యస్తం
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు
- ట్రాఫిక్ జామ్ లో నరకంలో ప్రజలు




2

## శ్రీసిటీలో చంద్రబాబు బిజిబిజీ

### 15 కంపెనీలు ప్రారంభించిన చంద్రబాబు

- ఏకకాలంలో 15 కంపెనీలు ప్రారంభించిన చంద్రబాబు
- మరో ఏడు సంస్థలకు శంకుస్థాపనలు
- రూ.900 కోట్ల పెట్టుబడులు
- సుమారు మూడు వేల మందికి ఉద్యోగాలు



**అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు తిరుపతి జిల్లా శ్రీసిటీలో నేడు పర్యటించారు. పలు ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఇక్కడ మొత్తం 15 సంస్థల కార్యకలా పాలను ఆయన ప్రారంభించిన ఆయన మరో ఏడు సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జికెమ్, ఇజ్రాయిల్‌కు చెందిన నియోలింక్, జపాన్‌కు చెందిన నైడిక్, ఓజెఐ ఇండియా ప్యాకేజ్, జర్మనీకి చెందిన బెల్ పరిశ్రమలతో పాటు భారతదేశానికి చెందిన అడ్మైర్, ఆటోడేటా, బాంబేకోటెడ్ స్పెషల్ స్టీల్స్, ఈప్యాక్, ఇఎస్ఎస్‌కెఏవై, ఎవర్‌షైన్, జేజీఐ, త్రినాత్, జెన్‌లెనిన్ సంస్థల కార్యాకలాపాలకు చంద్రబాబు నేడు శ్రీకారం చుట్టారు.. రూ. 900 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటైన ఈ సంస్థల ద్వారా 2 వేల 740మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మిగతా 2లో

## కోల్ కతా ట్రైయినీ డాక్టర్ శవ పరీక్ష నివేదిక.. ఏం జరిగిందంటే ?



**కోల్ కతా:** ఆర్ జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో ఇటీవల 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినీ డాక్టర్ హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఆమె శవపరీక్ష(అటాప్సీ) ఆమెకు 14 గాయాలయినట్లు ధ్రువీకరించింది. పైగా హత్యాచారానికి గురయిందని రుజువయింది. గాయలు, గొంతు పిసికి చంపడం వంటివి జరిగాయని రుజువయింది. ట్రెయినీ డాక్టర్ తల, ముఖం, మెడ, చేతులు, మర్మాంగాల పై ఉన్న గాయాలు ఆమె ఘోరంగా హత్యాచారానికి గురయిందని రుజువుచేస్తున్నాయి. ఆమెను గొంతు పిసకడం వల్ల ఊపిరాడకుండా చనిపోయిందని కూడా తెలుస్తోంది. ఆమె లైంగిక దాడి జరిగిందనడానికి ఆమె శరీరంపై ఉన్న గాయాలే సాక్ష్యం. అంతేకాక ఆమె మర్మాంగంలోకి బలవంతంగా పెనెట్రేషన్ చేసినట్లు కూడా రుజువయింది. బాధితురాలి మర్మాంగంలో తెల్లటి, మందమైన, చిక్కటి ఇంద్రియం లభించింది. బాధితురాలు ముక్కు, దవడ, ఎడమ చేయి, భుజం పై ఉన్న గాయాల ప్రకారం ఆమె హత్యాచారానికి ముందు చాలా పెనుగులాండిందని, పోరాడిందని తెలుస్తోంది. కానీ అగంతకులు ఆమెను తమ శారీరక బలంతో లోబరుచుకున్నారని తెలుస్తోంది. మృత దేహాన్ని చూసిన సాక్షులు ఆమె నీలం రంగు బెడ్ షీట్ లో మెడ నుంచి మోకాళ్ల వరకు చుట్టి ఉండడాన్ని, ఆమె కుర్తా తొలగిపోయి ఉండడం, ఆమె ట్రౌజర్లు కనిపించకపోవడం, ఆమె ల్యాప్ టాప్, నోట్ బుక్, సెల్ ఫోన్, ఓ వాటర్ బాటిల్ ఆమె శరీరం ప్రక్కన ఉండడం చూశామన్నారని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి.
ఆమె చావుకు కారణం గొంతు పిసకడమేనని తేలింది. ఆమె గాఢ నిద్రలో ఉండగా దాడి జరిగిందని కూడా శవ పరీక్ష నివేదిక పేర్కొంది. వైద్యురాలి శరీరంపై 14 చోట్ల గాయాలున్నాయని శవ పరీక్షలో గుర్తించినట్టు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. బలవంతంగా లైంగిక చర్య జరిగిన ఆనవాళ్లు ఉన్నాయని, దీని కారణంగా ఆమె వ్యక్తిగత అవయవాల వద్ద లోతైన గాయం జరిగినట్టు మిగతా 2లో

## గిగ్ వర్కర్ల దుస్థితి వర్ణనాతీతం : రాహుల్ గాంధీ



**ఢిల్లీ:** లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గిగ్ వర్కర్ల దుస్థితిని సోమవారం ప్రధానంగా ప్రస్తావించారు. వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పటిష్ఠ విధానాలు రూపొందిస్తాయని, దేశవ్యాప్తంగా వాటి అమలుకు ఇండియా కూటమి పాటుపడుతుందని రాహుల్ హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఇటీవల ఉబెర్ క్యాబ్‌లో ప్రయాణించి, డ్రైవర్‌తో ముచ్చటించినప్పటి వీడియోను ఆయన పోస్ట్ చేశారు. 'తక్కువ ఆదాయం, ద్రవ్యోల్బణం వారి జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. ఇది భారత్‌లోని గిగ్ వర్కర్ల దుస్థితి. ఉబెర్ ప్రయాణంలో సునీల్ ఉపాధ్యాయ్‌జీతో చర్చ, అతని కుటుంబంతో సమావేశం తరువాత దేశంలో క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ ఏజెంట్లు వంటి గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నా' అని రాహుల్ 'ఎక్స్'లో హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. 'వారు కనాకష్టంగా జీవిస్తున్నారు. పొదుపులు లేవు, కుటుంబ భవితకు పునాది లేదు. వీటి పరిష్కారానికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ విధానాల రూపకల్పన ద్వారా మిగతా 2లో

## కర్ణాటక ముఖ్యమంత్రికి హైకోర్టులో ఊరట



**బెంగళూరు:** తకర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకి హైకోర్టు ఊరటనిచ్చింది. భూ కుంభకోణం కేసులో తదుపరి ఆదేశాలిచ్చేంత వరకూ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోడానికి వీల్లేదని ట్రయల్ కోర్టుకి ఆదేశాలిచ్చింది. ఆగస్టు 29వ తేదీ వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. ఆ రోజు మరోసారి హైకోర్టు ఈ కేసుపై విచారణ చేపట్టనుంది. గవర్నర్ నోటీసులు ఇవ్వడాన్ని చట్ట వ్యతిరేకమని వాదించిన సిద్దరామయ్య ఈ మేరకు కోర్టుని ఆశ్రయించి పిటిషన్ వేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వాన్నీ కూల్చే ప్రయత్నం జరుగుతోందని ప్రస్తావించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. మిగతా 2లో

## రాజీవ్ విగ్రహం గాంధీ ఏర్పాటు చేస్తే అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం : కెటిఆర్



**ఢిల్లీ:** సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిపాదించిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుబట్టారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని వెల్లడించారు. తెలంగాణ పౌరుషం, వైభవాన్ని చాటేలా అద్భుతంగా నిర్మించిన సచివాలయం సమీపంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, పాలకులకు అమరవీరుల త్యాగాలను, స్ఫూర్తిని జ్వలింపజేస్తూ అమరజ్యోతి స్మారకాన్ని నిర్మించినట్లు వివరించారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మ గౌరవానికి ప్రతీకైన తెలంగాణ తల్లిని ఆ మధ్యలో ప్రతిష్టించాలన్న ఉద్దేశంతో ఒక ఐలాండ్‌ను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ తల్లికి మిగతా 2లో

# క్రీడలకు కేంద్ర బిందువుగా తెలంగాణ

తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏ విధంగా ఉండాలనే అంశంపై అధికారులకు ఆయన ఈరోజు సూచనలు చేశారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సందర్భంగా మాట్లాడుతూ... దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలన్నారు. అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకు రావడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో పాటు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు ఉండాలన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, శరీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలను గుర్తించి... ఉత్సాహవంతులను ప్రోత్సహించాలన్నారు. గతంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యమిచ్చిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు హైదరాబాద్‌ను వేదికగా మార్చాలన్నారు. ప్రతి క్రీడలో మన వాళ్లు పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకోసం నిపుణులతో శిక్షణ ఇప్పించాలన్నారు.

**తల్లి అంత్యక్రియలకు చిన్నారి బిక్షాటన... స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..**

తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది.

దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బులేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్యా,వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్య, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్ తరోడ గ్రామంలో గుండెలు పిండే విషాదం జరిగింది. తల్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిని విగత జీవిగా చూసిన ఆ కూతురుకి ఏం చేయాలో అర్థకాని పరిస్థితి నెలకొంది. స్థానికులకు ఈ వార్త తెలియడంతో మృత దేహాన్ని కిందికి దించారు. అయితే పూట గడవడమే కష్టంగా మారిని ఆ కుటుంబానికి అంత్యక్రియలకు కాసులు కరువయ్యాయి. ఆ కూతురు తల్లి మృతదేహం వద్ద ఎవరైనా సహాయం చేస్తారేమో అంటూ దీనంగా చూసింది. కానీ.. ఎవరూ తన తల్లి అంత్యక్రియలకు డబ్బులు ఇవ్వకపోవడంతో చివరకు తల్లికోసం కూతురు భిక్షాటన చేసింది. ఇంటి ముందు ఓ దుప్పటిని పరిచి అంత్యక్రియలకు సహాయం చేయాలను కోరుకుంటూ దీనస్థితిలో కూర్చున్న ఆ బాలికను చూసి.. అక్కడున్న వారందరికి కన్నీరు తెప్పించింది.

# కోల్ కతా ట్రైయినీ డాక్టర్ శవ పరీక్ష నివేదిక.. ఏం జరిగిందంటే ?

ఆ నివేదికలో ఉంది. ఊపిరితిత్తుల్లో ఎక్కువ మొత్తం రక్తస్రావం జరిగినట్టు పోస్ట్‌మార్టమ్‌లో గుర్తించారు. సంఘటన సమయంలో నిందితునితో విపరీతంగా ఆమె పోరాడి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. నిందితుడు సంజయ్ రాయ్‌కి వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు అతడి శరీరంపై గోళ్లతో రక్కిన గుర్తులు కన్పించాయని, బాధితురాలి మృతదేహాన్ని పరిశీలించగా, ఆమె గోళ్ల లోని చర్మం, రక్త నమూనాలు నిందితుడి నమూనాలతో సరిపోలినట్టు తెలుస్తోందని అధికార వర్గాలు వెల్లడించినట్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి. గొంతు నులిమి ఊపిరాడకుండా చేయడం వల్లనే ఆమె మృతి చెందినట్టు పోస్ట్‌మార్టమ్ నివేదికలో పేర్కొన్నారు. బాధితురాలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో నిందితుడు ఈ దాడికి పాల్పడి ఉంటాడని నివేదికలో వెల్లడించినట్టు తెలుస్తోంది. అలాగే మృతురాలి శరీరంలో పలుచోట్ల రక్తం గడ్డకట్టడంతో పాటు ఊపిరితిత్తుల్లో రక్తస్రావం కనిపించినట్లు పోస్ట్‌మార్టం నివేదిక పేర్కొంది. బాధితురాలిని అత్యంత క్రూరంగా మానవ మృగం అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోస్ట్‌మార్టం నివేదిక నిర్ధారిస్తోంది.


కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్.. ఆగస్టు 9న హత్యాచారానికి గురికావడం తెలిసిందే. ఆ రోజున మెడికల్ కాలేజీలోని చెస్ట్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్లో ట్రైనీ డాక్టర్ శవమై కనిపించింది. మరో నిర్భయ ఘటన తరహాలో ఈ ఘటన యావత్ దేశాన్ని కుదిపేస్తోంది. దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ దర్యాప్తు జరుపుతోంది. అత్యంత సున్నితమైన ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్‌ను నాలుగోసారి ప్రశ్నించింది. నలుగురు మెడికల్ కాలేజీ స్టూడెంట్స్‌ను కూడా విచారించింది. ఇక సీబీఐ మహిళా ఆఫీసర్ నిందితుడి ఇంటికి వెళ్లి విచారించారు. నిందితుడికి సైకాలజీ టెస్ట్ చేయాలని భావిస్తోంది సీబీఐ. హత్యాచార ఘటన జరిగిన స్పాట్‌కు వెళ్లి అత్యాధునిక పరికరాలతో స్కానింగ్ నిర్వహిస్తున్నారు అధికారులు. అటు కోల్‌కతా ఘటనను సుమోటో కేసుగా సుప్రీంకోర్టు స్వీకరించింది. దీనిపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగస్టు 20న విచారణ జరపనుంది. మంగళవారంనాటి విచారణలో సుప్రీంకోర్టు ఎలాంటి రూలింగ్ ఇవ్వనుందన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంటోంది.

# భారీ వర్షానికి భాగ్యనగరం విలవిల

**హైదరాబాద్:** భారీ వర్షానికి భాగ్యనగరం విలవిలలాడింది. అరగంటకు పైగా కురిసిన వర్షానికి నగరం అతలాకుతలం అయ్యింది. రహదారులు వరదకాలువలుగా మారాయి. రాజధాని పూర్తిగా చెరువును తలపించింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో నగరంలోని ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయ్యింది. దీంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి,మాదాపూర్, మియాపూర్, చందానగర్, షేక్‌పేట్, మెహిదీపట్నం,ఫిలింనగర్, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్,బంజారాహిల్స్,కూకట్‌పల్లి,కుత్బుల్లాపూర్,జీడిమెట్ల,నిజాం పేట్,బోయిన్‌పల్లి,సికింద్రాబాద్,ఉప్పల్,మల్కాజిగిరి,నాగోల్, బేగంపేట్, ముషిరాబాద్, లక్డికాపూల్, నాంపల్లి,కోఠి,ఎల్బీనగర్, రాజేంద్రనగర్ ,అత్తాపూర్,లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలుప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరదకాలువల్లాగా మారాయి. షేక్‌పేట్,యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో కార్లు నీటమునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. షేక్‌పేట్ ఫ్లై ఓవర్ వద్ద భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. యూసుఫ్‌గూడలో వాహనాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో లక్డికాపూల్ నుంచి గచ్చిబౌలి,గచ్చిబౌలి నుంచి మాదాపూర్,హైటెక్‌సిటీ, మియాపూర్ వెళ్లే ప్రాంతాలు, చందానగర్ నుంచి బాలానగర్, బాలానగర్ నుంచి మాసాబ్‌ట్యాంక్, సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రహదారులపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. కిలోమీటర్ దూరానికి కూడా అరగంటకు పైగా సమయం పట్టడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. సోమవారం రాఖీ పండగ సందర్భంగా కుటుంబమంతా సోదరసోదరీమణులకు రాఖీలు కట్టేందుకు వెళుండటంతో నగరం సందడిగా మారింది. పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డెక్కడంతో అప్పటికే రహదారులు రద్దీగా మారాయి. అయితే, మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షం కురవడం.. ఒక్కసారిగా రహదారులపై వరదనీరు చేరడంతో నగరం నరకాన్ని తలిపించింది. సాయంత్రం వరకు నగర రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలావుండగా, నగరంలో వర్షాలు కురిసినప్పుడే అధికారులు స్పందిస్తున్నారే తప్పా ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని నగరవాసులు మండిపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. నేటి ఉదయం నుంచి ఎండ వచ్చినప్పటికీ 12 గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దాదాపు 2 గంటలపాటు ఏకధాటిగా కురిసిన కుంభవృష్టితో హైదరాబాద్ అతలాకుతలమైంది. రోడ్లన్నీ జలమయమాయ్యయి. పలుచోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరింది. గంట వ్యవధిలోనే ఈదురు గాలులతో కూడిన జోరు వాన పడింది. మధ్యాహ్నం అనూహ్యంగా మేఘావృతం కావడం.. ఆ వెంటనే భారీ వర్షం కురవడంతో.. పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. ముఖ్యంగా హైటెక్ సిటీ ఏరియాలో భారీ వర్షం కురిసింది. దీంతో మాధాపూర్, కొండాపూర్ ఏరియాలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూకట్ పల్లి, బాలానగర్, మియాపూర్, దిల్ షుక్ నగర్, ఎల్బీ నగర్, ఉప్పల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అలాగే కీసర, ఇబ్రహీంపట్నం, దండుమైలారం, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్, సింగపూర్ టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో వాన దులిపేసింది.

**నేడు, రేపు భారీ వర్షాలు..** ఇక రేపు ,ఎల్లుండు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు:బండి సంజయ్



రాష్ట్రంలో సచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. సోమవారం మంచిర్యాల పర్యటనలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థ, బీఆర్ఎస్ విలీనం, ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విద్యావ్యవస్థలో నక్సలిజాన్ని జొప్పించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని పునరుద్ఘాటించారు. మ న సంస్కృతి, చరిత్ర మరుగునపడే ప్రమాదముందని హెచ్చరించారు. దేశ పరిణామాలపై అవగాహన లేకుంటే విచ్ఛిన్నమయ్యే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఇందుకు బంగ్లాదేశ్ సంక్షోభమే నిదర్శనమని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం కానుందని బండి సంజయ్ పునరుద్ఘాటించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే కాకుంటే కెసిఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ కొడుక్కి ఇంకా గర్వం తగ్గలేదని విమర్శించారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుపడాలని కోరుకుంటున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ తన ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇందిరమ్మ ఫొటో పెడితే ఊరుకునేది లేదని, ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఉండాల్సిందేనని అన్నారు. రుణ మాఫీ గురించి మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతన లేదన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికే మాఫీ చేశారని ఆరోపించారు.రూ.40 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. సోనియా గాంధీనే మోసం చేసిన ఘనులు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు.రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ రోజు రాఖీ పండుగ, ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తన ఇంటివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతనే లేదన్నారు. రూ.40 వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. ఆరు గ్యారెంటీలు కూడా అమలు చేయకుండ మోసం చేశారని, ఇవన్నీ అడుగుతుంటే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమంటూ కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.చనిపోయిన రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. . రుణమాఫీ పూర్తిగా చేస్తారా చేయరా చెప్పండి అని ప్రశ్నించారు. ఇటీవల చనిపోయిన రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నలభై వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తా అన్నారు ఇంతవరకు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు.ముఖ్యమంత్రి పదవి కోసం చాలా మంది కలలు కంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ పార్టీ అవినీతి పార్టీని మేము చేర్చుకోమన్నారు. కేసీఆర్ ను కాంగ్రెస్ పార్టీ జైల్లో పెట్టాలి .. కానీ ఇంతవరకు పెట్టలేదన్నారు. విలీనం అంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారు.. అప్పట్లో కాంగ్రెస్ లో బీఆర్ఎస్ ని విలీనం చేస్తా అని మాట తప్పాడన్నారు. కేటీఆర్ బతుకు ఎటుగాకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ పై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మంకీపాక్స్ కట్టడికి ఆసుపత్రులలో ఎమర్జెన్సీ వార్డులు



మంకీపాక్స్ వైరస్‌ను ఎదుర్కొనేందుకు భారతదేశం సర్వసన్నద్ధం అం యింది. ఆసుపత్రులు, ఎయిర్‌పోర్టులలో అనేక రకాల జాగ్రత్త చర్యలు ముమ్మరం చేశారని అధికార వర్గాలు సోమవారం తెలిపాయి. పొరు గున పాకిస్థాన్‌లో మంకీపాక్స్ కేసులు తలెత్తడం ప్రధాన అంశంగా పరిగణనలోకి తీసుకున్నారు. ఆసుపత్రులో వైరస్ సంబంధిత చికిత్స కోసంఅత్యవసర వార్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకించి ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులకు టెస్టుల ఏర్పాట్లు జరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వైరస్‌పై అంతర్జాతీయ అత్యయిక స్థితిని ప్రకటించిన నేపథ్యంలో వైరస్ నియంత్రణకు పలు మార్గదర్శకాలను ఖరారు చేశారు. రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలకు వీటి గురించి సమాచారం అందించారు.వీటిని పాటించడం, వైరస్ అనుమానిత ఉదంతాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖకు తెలియచేయడం ప్రధానమని తెలిపారు. వైరస్ నియంత్రణ కన్నా ముందుగా అడ్డుకట్టపైనే దృష్టి సారించాల్సి ఉందని ప్రధాని మోడీ ఆరోగ్య మంత్రిత్వశాఖకు ఆదేశాలు వెలువరించారు. ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్నారు. భారతదేశానికి మంకీపాక్స్ ముప్పు లేదని నిపుణులు తెలిపారు. అయితే ఉదాసీనత పనికిరాదని , పూర్తి సమన్వయంతో వ్యవహరించాల్సి ఉందని ప్రధాని ఆదేశించారు. వైరస్ పరిస్థితిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సమీక్ష జరిపారు. ఈ వైరస్‌పై గ్లోబల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో దేశంలో తీసుకోవల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులతో , నిపుణులతో ఆయన చర్చించారు.

# మరోసారి విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ...

చేసుకుంటున్నది. కాగా, ఒక భారత ప్రధాని ఉక్రెయిన్‌ను సందర్శించడం 30 పైచిలుకు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. 'నేతల మధ్య ఇటీవలి ఉన్నత స్థాయి చర్చలను ఈ పర్యటన ముందుకు తీసుకువెళుతుంది' అని తన్మయ లాల్ సూచించారు. పోలెండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ ఆహ్వానాలను పురస్కరించుకుని ప్రధాని మోడీ ఆ రెండు దేశాలను సందర్శిస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణను ఖండించకుండా భారత్ సంయమనం పాటించినందున ఉక్రెయిన్‌లో ప్రధాని మోడీ పర్యటన ప్రభావం ఏమాత్రం ఉంటుందో వేచి చూడవలసి ఉంటుంది. ప్రత్యేక సైనిక చర్యగా మాస్కో అభివర్ణించిన ఆ దురాక్రమణ గురించి ప్రధాని మోడీ బాహాటంగా మాట్లాడారు.

ఆ వివాదం పరిష్కారానికి పరస్పర చర్చలు అవసరమని ఆయన సూచించారు. అయితే, ఆ వివాదంపై భారత విస్పష్ట వైఖరి పాశ్చాత్య దేశాల విమర్శలకు గురైంది. చైనా ప్రభావం తగ్గించేందుకు న్యూఢిల్లీతో తన సంబంధాల పటిష్ఠతకు తాను ప్రయత్నిస్తున్న సమయంలో రష్యాతో భారత్ సన్నిహిత సంబంధాల పట్ల అమెరికా విచారం వెలిబుచ్చింది.

మరొక వైపు పాశ్చాత్య దేశాలతోను, తన దీర్ఘకాలిక మిత్ర దేశం రష్యాతోను సంబంధాలు కొనసాగించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది

# శ్రీసిటీలో చంద్రబాబు బిజిబిజీ

లభించాయని చంద్రబాబు ప్రకటివంచారు. ఇక చైనాకు చెందిన ఎన్‌జీసీ, బెల్జియంకు చెందిన వెర్మేరియన్, జపాన్‌కు చెందిన ఏజీ ఆండ్ పీ పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా జపాన్‌కు చెందిన రెండు పరిశ్రమలు, యూఏఇ, సింగపూర్‌లతో పాటు భారతదేశానికి చెందిన ఒక్కో పరిశ్రమ ఏర్పాటుపై ఒప్పందాలు చేసుకున్నారు. వాటి పెట్టుబడుల విలువ 1,213కోట్ల రూపాయలుగా ప్రభుత్వం ప్రకటించింది.

అనంతరం శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వివరించారు.. ఎపి పారిశ్రామిక విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు ఎపి సిఎం.

# గిగ్ వర్కర్ల దుస్థితి వర్ణనాతీతం : రాహుల్ గాంధీ

న్యాయంచేస్తాయి' అని ఆయన తెలిపారు. ఇండియా కూటమి పూర్తి స్థాయిలో దేశవ్యాప్తంగా వాటి అమలు జరిగేలా చూస్తుందని రాహుల్ హామీ ఇచ్చారు. ఉబెర్ యాప్ ద్వారా ఒక ట్యాక్సీ బుక్ చేసుకున్న తరువాత రాహుల్ ఒక క్యాబ్‌లో ప్రయాణం చేయడం 11 నిమిషాలపైగా సాగిన ఆ వీడియోలో కనిపించింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఉటాకు చెందిన క్యాబ్ డ్రైవర్‌తో ఆయన ముఖాముఖి సాగించి, అతని సమస్యల గురించి అడిగారు. సామాజిక భద్రత లేకుండా, డ్రైవర్లకు స్వల్ప రేట్లతో బొటాబొటీ నిధులతో జీవనం సాగిస్తున్నానని రాహుల్‌తో క్యాబ్ డ్రైవర్ చెప్పాడు. ఢిల్లీలో రోజులు గడవడం కష్టంగా ఉంటుండడంతో స్వగ్రామానికి వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నానని కూడా అతను చెప్పాడు. రాహుల్ ఆ ప్రయాణం ముగించి, క్యాబ్ డ్రైవర్ పిల్లలకు ఒక కానుక అందజేశారు. ఆ ప్రయాణం మరునాడు రాహుల్ గాంధీ ఢిల్లీలో ఒక ఫలహారశాలలో క్యాబ్ డ్రైవర్ కుటుంబంతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు గిగ్ వర్కర్ల గురించి ఆలోచిస్తున్నాయని ఆయన భరోసా ఇచ్చారు. డ్రైవర్లకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రత చేకూరేలా చూడాలని తాను అనుకుంటున్నట్లు రాహుల్ చెప్పారు.

# రాజీవ్ విగ్రహం గాంధీ ఏర్పాటు చేస్తే అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం : కెటిఆర్


కేటాయించిన స్థలంలో కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడుతోందని మండిపడ్డారు. వందలాది మంది తెలంగాణ ప్రజల ప్రాణాలు తీసిన కాంగ్రెస్ పార్టీ, మరోసారి తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పక్కకు పెట్టి, రాహుల్ గాంధీ విగ్రహాన్ని పెడుతోందని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి జై తెలంగాణ అనరని, అతి పెద్ద అంబేద్కర్‌కు కనీసం పూలదండ వేయరని, అమరజ్యోతిలోకి ఇప్పటి వరకు సందర్శకులను అనుమతించ లేదని ఆక్షేపించారు. తెలంగాణ బిడ్డ అంజయ్యను అవమానించిన రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్నారని, ఆయనకు తెలంగాణతో ఏం సంబంధమని ప్రశ్నించారు. గత పదేళ్లలో తాము ఏనాడూ పేర్ల మార్పుపై ఆలోచించలేదన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ పెడుతున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అధికారంలోకి రాగానే అక్కడి నుంచి తరలిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ దగ్గర మార్కులు కొట్టేయాలనుకుంటే గాంధీ భవన్‌లో లేదా రేవంత్ రెడ్డి ఇంట్లో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టుకోవాలని సూచించారు. నాలుగేళ్లలో తెలంగాణలో కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తొలగించి, కాంగ్రెస్ పార్టీ కోరుకున్న చోటికి పంపిస్తామని అన్నారు. ఇవాళ తెలంగాణ తల్లికి కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాన్ని మరచిపోలేమని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే తెలంగాణ మహనీయుడి పేరును అంతర్జాతీయ విమానాశ్రయా నికి పెడతామని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, అమరవీరుల త్యాగాలను అవమానపరిచేలా రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్న కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ తల్లి విగ్రహానికి అవమానం జరిగితే ఊరుకోం. సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయొద్దు. రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం. శంషాబాద్ విమానాశ్రయానికి కూడా రాజీవ్ పేరు తొలగిస్తా'మని కెటిఆర్ అన్నారు.

# కర్ణాటక ముఖ్యమంత్రికి హైకోర్టులో ఊరట

సిద్దరామయ్యకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

**ఎన్నడూ తప్పు చేయలేదు: సిద్ధ రామయ్య..** న 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన గవర్నర్ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు. " నా రాజకీయ జీవితం తెరచిన పుస్తకం. ఇప్పటి వరకూ ఎలాంటి తప్పు చేయలేదు. భవిస్యత్తులోనూ చేయబోను. నా ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకే బిజెపి, జెడిఎస్ కలిసి కుట్ర పన్నాయి" అన్నారు. "నా రాజకీయ జీవితంలో ఒక్క మరక లేదు. నా పై విచారణ చేయమంటూ గవర్నర్ ఇచ్చిన ఆదేశం రాజకీయ ప్రేరేపితమైనది. వాటిని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటా" అని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తనను నాశనం చేస్తే మొత్తం కాంగ్రెస్ పార్టీనే నాశనం చేయొచ్చన్న భ్రమలో బిజెపి ఉందని అన్నారు. మహారాష్ట్ర, జారండ్, ఢిల్లీలో మాదిరిగా కర్ణాటకలో కూడా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. 'ముడా' విచారణ విషయంలో రాజీనామా చేయల్సిన అవసరం లేదన్నారు.

# హసీనాపై మరో రెండు హత్య కేసులు



మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు మాజీ మంత్రుల పై సోమవారం తాజాగా మరో రెండు హత్య కేసులు నమోదయ్యాయి. కోటా వ్యతిరేక ఆందోళనలు చెలరేగిన సమయంలో ఈ హత్యలు జరిగాయని వేర్వేరుగా రెండు కేసులు దాఖలు అయ్యాయి. ఢాకా లోని మీర్‌పూర్ ఏరియాలో లిటన్ హసన్ లాలూ అలియాస్ హసన్ హత్యకు గురికాగా, లిటన్ సోదరుడు కేసును హసీనా పైన, మాజీ హెూం మంత్రి అసదుజ్జమన్ ఖాన్ కమల్, మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అబ్దుల్లా అల్ మమున్, మరికొందరిపైన ఢాకా కోర్టులో కేసు దాఖలు చేశారు. లిటన్ ఆగస్టు 4న మీర్‌పూర్ ఏరియాలో విద్యార్థుల శాంతియుత ప్రదర్శనలో పాల్గొనగా,హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ కాల్పులు జరిపిందని తీవ్రంగా గాయపడిన హసన్ తరువాత మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో కేసు షేర్ ఇ బంగ్లానగర్ ఏరియా నుంచి హతుడు తారిక్ హెుస్సయిన్ తల్లి ఫిదుషీ ఖతూన్ కేసు దాఖలు చేసింది. హసీనాతోపాటు మాజీ రోడ్డు రవాణా మంత్రి ఒబైదుల్ ఖాదర్, మాజీ హెూం మంత్రి కమల్, మాజీ విదేశాంగ మంత్రి హసన్ మహముద్, రాష్ట్ర సమాచార మంత్రి మొహమ్మద్ అలీ అరాఫత్‌పై ఆమె కేసు దాఖలు చేశారు.

## శంకర్ పల్లి సీనియర్ జర్నలిస్ట్
# నరసింహస్వామి మృతి...



**శంకర్‌పల్లి, ఆగస్టు 19.(డైలీ రిపోర్ట్) :** శంకర్ పల్లి మున్సిపాలిటీకి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎం. నరసింహస్వామి (68) సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. నరసింహ స్వామి ఈనాడు దినపత్రికలో సుమారు 20 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా పనిచేశారు. ఆంధ్రప్రభ లో కూడా ఆయన రిపోర్టర్గా పనిచేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, శంకర్ పల్లి మండలం టిడిపి ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు సేవలు అందించారు. కాగా సోదరుడు శంకర్ పల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్ నరసింహస్వామి అంతక్రియలు శంకరపల్లి లో మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతాయని తెలిపారు. నిజాయితీకి, విజ్ఞతకు మరో పేరుగా పత్రికలలో పనిచేశారని ఆయన సన్నిహితులు, స్నేహితులు, బంధువులు తెలిపారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సన్నిహితులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు



**శంకర్‌పల్లి ఆగస్టు 19 (డైలీరిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామంలో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అక్కలు, చెల్లెళ్లు అన్నయ్యలకు, తమ్ముళ్లకు రాఖీ కట్టి మురిసిపోయారు. మండల టిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆప్యాయతకు ప్రతి అని అన్నారు.
అక్కలు, చెల్లెల్లు తమ అన్న, తమ్ముళ్లకు రాఖీ కట్టి తమ ప్రేమ ఆప్యాయతను వ్యక్తపరిచారు. అన్నలకు, తమ్ముళ్లకు అక్క, చెల్లెళ్లు ఆశీర్వాదాన్ని ఇచ్చారు.

## ఘనంగా రాఖీ పండుగ జరుపుకున్న
## కౌన్సిలర్ బిసోల్ల సంధ్యారాణి అశోక్ కుమార్



**శంకర్‌పల్లి: ఆగస్టు 19: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ రెండో వార్డులో రాఖీ పండుగను సంధ్యారాణి అశోక్ కుమార్ ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెల అక్క తమ్ముళ్ల ఆప్యాయతకు, అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని అన్నారు. మున్సిపల్ ప్రజలందరికీ రాఖి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

- గంటల కొద్దీ తేరుకోని షేక్‌పేట
- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం..
- కుమ్మరించిన వానతో అతలాకుతలమైన గ్రేటర్
- మరో రెండు రోజులు వర్ష సూచన



**హైదరాబాద్, ఆగస్టు 19 :** ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా సోమవారం మధ్యాహ్నం కురిసిన వాన గ్రేటర్ జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. దాదాపు గంట పాటు కుమ్మరించిన వర్షంతో కొన్ని చోట్ల ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా వరుణుడి 'దెబ్బకు షేక్‌పేట షేక్ అయింది. 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. షేక్‌పేటలో గల్లీ నుంచి ప్రధాన రహదారులపై వరద నీరు ముంచెత్తింది. కార్లు, బైకులు కొట్టుకుపోయాయి..షేక్‌పేట వైపు ప్రయాణం అంటేనే జడిసిపోయేలా చేసింది. రాత్రి వరకు షేక్‌పేట వరద ప్రభావం నుంచి కోలుకోలేదు. ఒక్క షేక్‌పేటే కాదు..శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, బాలానగర్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ఈ క్రమంలోనే చిన్నపాటి వర్షానికే నెమ్మదించే నగర ట్రాఫిక్ భారీ వర్షానికి స్తంభించిపోయింది. మరోవైపు నగరంలో అనేక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. అదృష్టవశాత్తు గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. మొత్తంగా ట్రాఫిక్ పోలీసులు, సహాయక చర్యల ఆలస్యంతో నగరంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది.

# యుద్ధాలతో ప్రాణాంతక రోగాల విజృంభణ





యుద్ధాల వల్ల, ఒకవైపు ఆయుధ పరిశ్రమలు బాగు పడుతున్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం పట్టు పెంచుకుంటోంది. మరోవైపున పౌర జనాభాకు యుద్ధ ప్రాంతంలో ఉండేవారికే కాకుండా, బయట ఉండే వారికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. యుద్ధాల వల్ల అంటువ్యాధులు, మహమ్మారులు ప్రబలుతాయి. ఆరోగ్య సంక్షోభాలు వస్తాయి. ఏ యుద్ధ చరిత్ర చూసినా ఇదే కనిపిస్తుంది.గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం, ఊచకోత పోలియో ప్రబలడానికి కారణమవుతున్నది. టీకాల కార్యక్రమం ఆగిపోవడం వల్ల, మురుగు నీటి వ్యవస్థ విచ్ఛినం కావడం వల్లా యుద్ధానికి ముందు నియంత్రణలో ఉన్న పోలియో, మళ్లీ విజృంభిస్తున్నదని డబ్ల్యు.హెచ్.ఓ చెబుతున్నది. క్రిక్కిరిసిపోయిన శరణార్థుల గుడారాల శిబిరాల్లో ఇది మరింత ఎక్కువ.

ఇజ్రాయిల్ విచక్షణారహితంగా చేస్తున్న బాంబుల దాడి వల్ల, వ్యాక్సిన్లతో సహా ఇతర అత్యవసర వైద్య సరఫరాలు ఆగిపోయాయి. తొమ్మిది నెలలుగా వ్యాక్సిన్లు లేకపోవడంతో వారికి-పోలియో పెరిగే ప్రమాదం తీవ్రమౌతోంది. వ్యాక్సిన్ సక్రమంగా ఇవ్వకపోతే వచ్చే 'వ్యాక్సిన్ పోలియో' కూడా కనిపిస్తోంది. తక్షణం ఈ సంక్షోభంలో జోక్యం చేసుకోవడం అంతర్జాతీయ సమాజం బాధ్యత. సురక్షిత నీరు, శానిటేషన్ లేకపోవడం వల్ల ఇతర అంటువ్యాధులూ పెరుగుతున్నాయి. హెపటైటిస్-ఎ కేసులు బాగా పెరుగుతున్నాయి. ఈ విషయం ఐక్యరాజ్యసమితే చెప్పింది. అక్టోబర్ నుండి 4000 కేసులు రిపోర్టు అయ్యాయి. ఈ పరిస్థితులలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పది లక్షల పోలియో వ్యాక్సిన్లను గాజాకు పంపుతున్నట్లు తెలిపింది. పసిపిల్లలను రక్షించి జబ్బు వ్యాప్తిని నిరోధించటానికి ఉద్దేశించినది ఇది. యుద్ధం, అస్థిరతలు ఉన్న పరిస్థితుల్లో ఇదంతా సాధ్యమవుతుందా అనే సందేహం ఉండనే ఉంది. వ్యాక్సిన్లను ఇజ్రాయిల్ సైన్యం వరకు ఇస్తే చాలానే సంకుచిత అభిప్రాయంతో ఇజ్రాయిల్ ఆరోగ్య అధికారులు ఉన్నారు. కానీ వైరస్‌లు మనుషులు పెట్టుకొన్న సరిహద్దులను లెక్కచేయవు. అవి అన్ని వైపులా వ్యాపిస్తాయి. వెంటనే తగిన చర్యలు తీసుకొని వైద్య సేవలు పునరుద్ధరించక పోయినట్లయితే, గాజాకే కాదు%ఔ%పాలస్తీనా పౌరులకే కాదు ఆ ప్రాంతమంతటా ఒక ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. గాజాలో ఉన్న బాధిత ప్రజల ఆరోగ్యానికి, భద్రతకూ, మానవీయ సహాయానికి అంతర్జాతీయ సమాజం ప్రాధాన్యతనివ్వాలి. ఇప్పటి వరకు, ఇజ్రాయిల్ పాలస్తీనాపై మొదలెట్టిన ఈ యుద్ధం, ఊచకోతలో, 18 లక్షల అంటువ్యాధుల కేసులు రిపోర్ట్ అయ్యాయి. %యాంటీబయాటిక్స్‌ను సక్రమంగా వాడకపోతే, యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ వస్తుంది. అంటే సూక్ష్మజీవులు యాంటీబయాటిక్స్ వల్ల నశించకుండా, వాటికి అలవాటు పడి, తట్టుకొని మరింత శక్తివంతంగా తయారవుతాయి. ఇటువంటి బ్యాక్టీరియాలనే సూపర్ బగ్స్ అంటారు. యుద్ధాలు ఇటువంటి సూపర్ బగ్స్ తీవ్రతను, వ్యాప్తిని పెంచుతాయి. 2003లో అమెరికా ఇరాక్‌ను ఆక్రమించిన యుద్ధం తరువాత, సైనికుల్లో ఇవి కనిపించాయి. పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు ఇవి విజృంభిస్తాయి. ఉక్రెయిన్, గాజా ప్రాంతాలలో, దెబ్బతిన్న ఆసుపత్రులలో ఇవి సులభంగా సైనికుల నుంచి పౌరులకు సోకుతాయి. మందుపాతరల శకలాలు, మిస్సైల్ శకలాలలో, భార లోహ శకలాలలో కూడా ఈ బ్యాక్టీరియా ఉండి, పరిస్థితిని దిగజారుస్తాయి.

అమెరికా, నాటో వత్తాసుతో జరుగుతున్న ఈ యుద్ధాలు%ఔ% ప్రజారోగ్య సంక్షోభాలకు యాంటీబయాటిక్ రెసిస్టెంట్ బ్యాక్టీరియాల ఆవిర్భావానికి కారణమవుతున్నాయి. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ తగ్గించాలని ప్రపంచవ్యాప్తంగా ఒక సాధారణ ప్రచారం జరుగుతోంది. కానీ రెండు దశాబ్దాలుగా, యుద్ధాల వల్ల, ఇటువంటి రెసిస్టెన్స్ పరిస్థితి ఏర్పడితే దాన్ని, పట్టించుకోవడం లేదు. వాతావరణ మార్పు లాగా ఇది కూడా ఎప్పుడో, నిదానంగా వచ్చే సమస్యగా భావిస్తున్నారు. రాజకీయ నిర్లక్ష్యం, ఆర్థిక వనరుల కేటాయింపులలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో కొత్త యాంటిబయాటిక్స్‌ను కనుగొనాలన్నా, ప్రత్యామ్నాయ వైద్యాలు ఆవిష్కరించాలన్నా, అంతర్జాతీయ సహకారం అవసరమని గ్రహించాలి. హార్వర్డ్ మెడికల్ స్కూల్ లాంటి చోట్ల సూపర్ బగ్స్‌ను ఎదుర్కొనే పరిశోధనలు చేస్తున్నారు. 'జోసురాబాల్ పిన్' అనే మందుపై మొదటి దశ ప్రయోగాలు జరుగుతున్నాయి. కానీ ఇది ఒక మానవీయ సమస్య అనీ, రాజకీయ సమస్య అనీ గుర్తించాలి. దీనికి దీర్ఘకాలిక, రాజకీయ పరిష్కారాలు ఉంటాయి కానీ, శాస్త్ర సాంకేతిక పరిష్కారాలు ఒకటే చాలవు. యుద్ధాలు మనుషుల్ని నిలువ నీడ లేకుండా చేసి తరిమివేస్తాయి. ఆరోగ్య వ్యవస్థలను దెబ్బ తీస్తాయి. అయితే మహమ్మారులు యుద్ధాలను కూడా తీవ్రతరం చేస్తాయి. అవి జాతీయవాదాన్ని, జాత్యహంకారాన్ని రంగంలోకి తీసుకు వస్తాయి. ఉదాహరణకు, కోవిడ్ 19 యూరప్‌లో 'నగార్నో-కారబాఖ్' సంఘర్షణలను తీవ్రతరం చేసింది. అక్కడ 30 ఏళ్లలో ఏనాడూ జరగనంత మరణహోమం చోటుచేసుకుంది. రెండో ప్రపంచ యుద్ధంలో సైన్యం తరలింపులు, మిలిటరీ క్యాంపులు అంటువ్యాధుల వ్యాప్తికి కావాల్సిన పరిస్థితులు సృష్టించాయి. ఆనాడు, తట్టు (మీజిల్స్), క్షయ (టి.బి) లాంటివి సైనికుల్లో మామూలైపోయాయి. విజృంభిస్తున్న జబ్బుల్ని నియంత్రించడం వీలు కాలేదు. యుద్ధం వల్ల ఆరోగ్య వ్యవస్థలు దెబ్బతినడం ఇందుకు కారణం. వియత్నాం యుద్ధంలో (1955-75) కూడా ఇదే జరిగింది. మలేరియా, ఇతర ఉష్ణ మండల జబ్బులు చెలరేగాయి. సైన్యం తరలింపులు, జనాభా స్థానభ్రంశాలు ఇందుకు కారణం. మొదటి ప్రపంచ యుద్ధం (1918-19)లో ఇన్‌ఫ్లుయంజా పాండమిక్ వచ్చింది. యుద్ధాలలో మహమ్మారులు ప్రబలుతాయనటానికి ఇదో ఉదాహరణ. మొదట అమెరికన్ మిలిటరీ క్యాంపులలో ఇది కనిపించింది. కిక్కిరిసిన ప్రయాణాలతో వైరస్ వ్యాప్తి చెందింది. ఆనాడు అక్కడ ఉన్న దుర్భర పరిస్థితులు, పౌష్టికాహార లోపం, అపరిశుభ్రత ఇన్‌ఫ్లుయంజా వ్యాప్తిని ఎగదోశాయి. రోగనిరోధక శక్తి తగ్గి సెకండరీ ఇన్ఫెక్షన్లూ తయారయ్యాయి. ఈ యుద్ధంలో మొత్తం మీద ఐదు కోట్ల మంది ప్రపంచ వ్యాప్తంగా చనిపోయి ఉంటారని ఒక అంచనా. చరిత్రలో సైనిక దళాలు ఎక్కడ ఉంటే, వాటి వెంటే జబ్బులు వచ్చాయి. యుద్ధాలలో చనిపోయే వారి కంటే జబ్బులతో చనిపోయే వారే ఎక్కువ. ఇది రుజువైన విషయం. మరో ఉదాహరణ ఏమంటే, అమెరికన్ సివిల్ వార్ (1861-1865)లో మీజిల్స్, డీసెంట్రీ, స్మాల్‌పాక్స్ వల్ల యుద్ధాలలో కంటే ఎక్కువ మంది చనిపోయారు. కారణం దుర్భరమైన పారిశుధ్య పరిస్థితులే. క్రిమియన్ యుద్ధం (1853-1856)లో, యుద్ధ గాయాల కంటే ఎక్కువగా కలరా, టైఫస్‌ల వల్ల చనిపోయారు. నిజానికి ఈ అంటువ్యాధులను నిరోధించవచ్చు. కానీ యుద్ధాల వల్ల దెబ్బతినే పారిశుధ్య పరిస్థితులు దానికి అడ్డంకిగా ఉంటాయి.క్రిమియన్ యుద్ధం తర్వాత ఫ్లోరన్స్ నైటింగేల్ గణాంకాలతో ఇటువంటి మరణాలను నిర్ధారించడం, చాలామందిని ఆలోచించేలా చేసింది. ఆమె రూపొందించిన 'యుద్ధ పరిస్థితుల సవివరణాత్మక కథనాల' పద్ధతి ఆ తరువాత ప్రజారోగ్య అడ్వొకసీలో ఒక భాగంగా మారింది.

యుద్ధానికి శాంతియుత పరిష్కారాల చర్చల్లో ప్రజారోగ్య వ్యవస్థల పునరుద్ధరణ కూడా ఒక భాగం కావాలి. ప్రపంచంలో ఆరోగ్య పరిస్థితులు మెరుగు పడాలన్నా, ఒక సామాజిక సమ న్యాయం సాధించాలన్నా, యుద్ధాలకు మహమ్మారులకూ రెండింటికి పరిష్కారం సాధించాలి. వ్యాక్సినేషన్లు కూడా శాంతి సాధన ప్రయత్నాలలో భాగమవుతాయి. యుద్ధాల వల్ల మానవ ఆరోగ్యం చిన్నాభిన్న మవుతుందనేది స్పష్టం. యుద్ధ ప్రాంతాలలో బాధితులకు భద్రతను, ఆరోగ్యాన్ని మానవ సహాయాన్ని అందించే బాధ్యత అంతర్జాతీయ సమాజానికి ఉంటుంది. యుద్ధాలన్నీ ఆగాలి. అలాగే పాలస్తీనాలో జరుగుతున్న ఊచకోతను వెంటనే ఆపాలి. యుద్ధాల కారణంగా సూపర్ బగ్స్, వైరస్‌లు పెచ్చరిల్లి అంటువ్యాధులు ప్రబలి, మరో ప్రపంచ ఆరోగ్య సంక్షోభాన్ని సృష్టించవచ్చు. మరో, భయానకమైన మహమ్మారికి రంగం సిద్ధం కావచ్చు.

# చేయూత లేని చేనేత

వ్యవసాయం తరువాత చేనేత రంగం రెండవ ప్రాధాన్యత కల్గిన రంగంగా ప్రసిద్ధి చెందింది. పాలకులు కూడా ఈ అంశాన్ని ప్రచారం చేస్తుంటారు. ఆచరణలో మాత్రం చేనేత రంగం కనుమరుగయ్యే పద్ధతిలో వ్యవహరిస్తున్నారు. మానవునికి నాగరికత నేర్పిన రంగం చేనేత. ఈ రోజు చేనేత కార్మికులు కట్టుకోవటానికి సరైన బట్ట కూడా లేని పరిస్థితికి నెట్టబడ్డారు. చేనేత రక్షణకు సహకార రంగం అవసరమని అనేక ఆందోళనలు జరిగిన నేపథ్యంలో 1964లో సహకార రంగ చట్టం వచ్చింది. ఆ చట్టం ద్వారా చేనేత కార్మికుల షేర్ ధనంతో, సొసైటీలో సభ్యులుగా చేరిన వారితో కమిటీ ఏర్పడి, ఆ కమిటీ నాయకత్వంలో ప్రభుత్వ సహకారంతో సొసైటీలు నడవాలని ఆ చట్టం చెప్తోంది.అదే కాలంలో సహకార సంఘాలు తయారు చేసిన వస్త్రాలను మార్కెటింగ్ చేయటం కోసం ఆప్కోను ఏర్పాటు చేశారు. అదే సందర్భంలో ప్రైవేటు సెక్టారులోని మాస్టర్ వీవర్ల దగ్గర తయారైన వస్త్రాలు కొనుగోలు చేయటానికి ఆప్టెక్సు సంస్థను ఏర్పాటు చేశారు. ఆచరణలో చేనేత కార్మికుల నాయకత్వాన సహకార సంఘాలు పని చేసినంతకాలం సహకార రంగం కొంత అభివృద్ధి చెందింది. పట్టణాలలో ఆప్కో షోరూంల ద్వారా చేనేత అమ్మకాలు జరిగి చేనేత కార్మికులకు పని దొరికింది. కానీ పాలక వర్గాలు చేనేతపై దృష్టి పెట్టకపోవటంతో సహకార సంఘాలకు ఇవ్వాల్సిన రిబేటు, చేనేత కార్మికులకు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మజూరి పెంచకపోవడంతో చేనేత కార్మికులు ప్రైవేటు సెక్టారులోని మాస్టరు వీవర్ల దగ్గర నేత నేయటానికి మరలారు. దీనికితోడు సహకార రంగంలోకి రాజకీయ నాయకులు ప్రవేశించ సాగారు. దీంతో అధికార పార్టీ వారు ఆ సొసైటీ పాలక వర్గంగా ఎన్నికవుతున్నారు. ఆ పాలకవర్గం, చేనేత జౌళి శాఖ అధికారులు కుమ్మక్కై వస్తున్న నిధులను సహకార సంఘంలో ఉపయోగించకుండా దారి మళ్లించి అవినీతికి పాల్పడుతున్న ఘటనలు ఎన్నో. సహకార రంగం దివాళా తీసే పరిస్థితికి రావటం, సొసైటీ ప్రెసిడెంట్లు అవినీతితో లక్షల రూపాయలు పోగేసుకోవటం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా చేనేత కార్మిక సంఘాలు, చేనేత సొసైటీలకు నిధులు కేటాయించి సహకార సంఘాలను బలోపేతం చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంలో ఎన్‌టిఆర్ నష్టాలలో నడుస్తున్న సొసైటీలను లాభాలలో నడుస్తున్న సొసైటీలలో విలీనం చేశారు. ఈ విలీనంతో లాభాల బాటలో నడుస్తున్న సహకార సంఘాలు కూడా దివాళా తీశాయి. దీనికి మరొక కారణం సహకార సంఘాలు నాబార్డు దగ్గర అప్పు తీసుకొచ్చి వస్త్రాలు తయారు చేస్తాయి. ఈ వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేస్తుంది. ఆ వస్త్రాలను 6 శాతం లాభంతో కొనుగోలు చేస్తుంది. కొనుగోలు చేసిన వస్త్రాలకు సంవత్సరాల తరబడి ఆప్కో డబ్బు చెల్లించలేకపోవటంతో సొసైటీలు నాబార్డు దగ్గర తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించాలి. ఆ వడ్డీ మూడు నెలలకు ఒకసారి 13 శాతంతో కలిపి లెక్క కడతారు. ఆ విధంగా సొసైటీలు దివాళా తీస్తున్నాయి. ఇప్పటికి సహకార రంగంలో పని చేస్తున్న సొసైటీలకు పావలా వడ్డి, యారన్ సబ్సిడీ, రిబేటు, త్రిఫ్ట ఫండు కింద 80 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. పనిచేస్తున్న సొసైటీలు ఈ డబ్బులేవీ రాక, కార్మికులకు పని చూపించలేక, చేసిన పనికి మజూరి సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయి. సొసైటీలో ఒక్క మగ్గం కూడా పని చేయకుండా సొసైటీ పేరు మాత్రమే ఉండి, పని చేస్తున్నట్లు రికార్డులు తయారు చేసి, వస్తున్న రాయితీలు మొత్తం సొసైటీ ప్రెసిడెంటు చేనేత జౌళి శాఖ అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడుతూ దిగమింగుతున్న పరిస్థితి ఉన్నది.

చేనేత కార్మికులకు సంవత్సరం పొడవునా పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాజీవ్ విద్యా మిషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు ఉచితంగా చేనేత వస్త్రాలు ఇవ్వాలని చట్టం చేసింది. దీంతో మన రాష్ట్రంలో చేనేత మగ్గాలపై వస్త్రాలు తయారు చేయిస్తే సంవత్సరం పొడవునా చేనేత కార్మికులకు పని దొరుకుతుందని, చట్ట ప్రకారం మజూరి తగినంత వస్తుందని ఆశించిన చేనేత వర్గానికి పాలకులు వెన్నుపోటు పొడిచారు. చేనేత వస్త్రాలకు బదులు పవర్‌లూం వస్త్రాలు ఇచ్చి చేనేత వస్త్రాలుగా రికార్డులు తయారు చేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. ఆప్కో చైర్మన్లు అధికారులతో కుమ్మక్కై దిగిమింగి చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేయడం మనం చూస్తున్నాము. ఆప్కో చైర్మన్‌గా ఉన్న వ్యక్తి రూ.1000 కోట్లు దిగమింగారని కేసులు పెట్టడాన్ని మనం చూస్తున్నాము. మరొకపక్క చేనేతకు కేటాయించిన 11 రకాల వస్త్రాలు పవర్‌లూంపై తయారవుతుంటే, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహిస్తున్న వైనం చూస్తున్నాము. ఈ రోజు పట్టు చీరల రంగంలోకి కూడా పవర్‌లూంలు ప్రవేశించటంతో ఆ రంగం సంక్షోభంలో పడి ఆత్మహత్యలు జరుగుతున్నాయి. మరొకపక్క చేనేతకు అవసరమైన నూలు పట్టు ధర 2021లో రూ.1100 నుంచి 2 వేల రూపాయలకు పెరిగింది. పట్టు ధర రూ.3800 నుంచి 8 వేల రూపాయలకు పెరిగింది. దీనికి తోడు జిఎస్‌టి నూలుపై 5 శాతం, రంగులపై 8 శాతం, రసాయనాలపై 18 శాతం, తయారైన తర్వాత వస్త్రంపై 18 శాతం జిఎస్‌టి వేయటంతో చేనేత రంగం, సొసైటీలు మరింత ఇబ్బందులు పడుతున్నాయి. అందుకే బోగస్ సొసైటీలను రద్దు చేసి పని చేస్తున్న కార్మికులకు మాత్రమే సహకార సంఘంలో సభ్యత్వం ఇచ్చి వారితో సొసైటీలు ఏర్పాటు చేయాలి.

పని చేస్తున్న వారితోనే ఎన్నికలు జరిపి సక్రమంగా పని జరిగేటట్లు సహకార రంగాన్ని పటిష్టపరచాలి. 2021లో కరోనా సమయంలో మాస్కులను రాష్ట్రం మొత్తం సప్లయి చేయటానికి చేనేతవి ఇవ్వాలని చెప్పినా తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ వెళ్లి పవర్‌లూం బట్టతో కుట్టించి చేనేతవని కోట్ల రూపాయలు దిగమింగడం చూశాము. అదే కాకుండా గతంలో ప్రభుత్వాలకు తెలియకుండా అధికారులు, ఆప్కో చైర్మన్లు పవర్‌లూంలు కొని కోట్లకు పడగలెత్తారు. జగన్ హయాంలో పవర్‌లూం మగ్గంపై తయారైన బట్టను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఆప్కో గోడౌన్లలో పెట్టింది. మీటరుకు 20 రూపాయల అదనపు బిల్లులతో 20 లక్షల మీటర్లు కొనుగోలు చేసి 4 కోట్ల రూపాయలు దిగమింగారు. ఇందులోనూ అధికారులు, పాలక పార్టీల వారు భాగస్వాములే. ఇకపోతే, చేనేత కార్మికులకు కనీస వేతన చట్టాన్ని రెండు సంవత్సరాలకు ఒకసారి సవరించాలి. కాని మన రాష్ట్రంలో 2009లో సవరించారు. మరల ఇంతవరకు కనీస వేతన చట్టం సవరించకపోవటంలో చేనేత కార్మికులకు వస్తున్న ఆదాయం చాలక అప్పులపాలై ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలౌతున్నారు. చేనేత సహకార రంగాన్ని రక్షించటానికి చేనేతకు కేటాయించిన 11 రకాల వస్త్రాలు పవర్‌లూమ్‌లపై తయారు కాకుండా చర్యలు తీసుకోవాలి. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి.కేరళలో వామపక్ష ప్రభుత్వం చేనేత రక్షణకు కొన్ని చర్యలు తీసుకున్నది. అక్కడ సహకార సంఘాలదే ప్రధాన పాత్ర. ప్రైవేటు రంగంలో మాస్టర్ వీవర్లు నామమాత్రమే.

1951 నుంచి ఇప్పటి వరకు ఒక్క సహకార సంఘం మూతపడలేదు. 1989లో 15 మందితో కేరళ హ్యాండ్లూమ్ వర్కర్సు వెల్‌ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేశారు.

దీనిలో ఐదుగురు అధికారులు, ఐదుగురు యూనియన్ నాయకులు, కార్మికులు సభ్యులుగా ఉంటారు. దీనికి ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయిస్తుంది. కమిటీ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆధీనంలో పనిచేస్తుంది. 5 కేంద్రాలలో ప్రాంతీయ బోర్డులు ఉన్నాయి. వీటిలో 96 వేల మంది సభ్యులుగా ఉన్నారు.

58 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు నేరుగా వెల్‌ఫేర్ ఫండ్ బోర్డు నుంచి పెన్షన్ అందజేస్తున్నారు.

ఆ సభ్యుని కుమార్తె వివాహం ఉంటే 5 వేల రూపాయలు, మహిళా చేనేత కార్మికురాలి ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసూతి అనంతరం మూడు నెలలపాటు నెలకు 2 వేల రూపాయలు ఉచితంగా ఇస్తున్నారు. డెత్ బెనిఫిట్ కింద రూ.5 వేలు ఇస్తున్నారు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు చిన్నారులకు ఉచితంగా చేనేత వస్త్రాలు ఇస్తున్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు నెలకు 500 రూపాయలు, డిగ్రీ చదివే విద్యార్థులకు 800 రూపాయలు ఇస్తున్నారు. మండలంలో ఉండే స్కూలు పిల్లలకు అదే మండల పరిధిలో ఉన్న సహకార సంఘాలే బట్టలు కుట్టించి ఇస్తాయి. ఆ సహకార సంఘాలకు ప్రభుత్వం నేరుగా డబ్బు చెల్లిస్తుంది. సహకార సంఘంలో పనిచేసే చేనేత కార్మికులకు ఇ.ఎస్.ఐ, పి.ఎఫ్, డి.ఎ సౌకర్యం కల్పించారు. ఈ విధంగా ప్రత్యామ్నాయ విధానాల ద్వారా కేరళ ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకుంటోంది. పైగా సహకార రంగంలో తయారయ్యే వస్త్రాలను పెద్ద పెద్ద షోరూమ్‌లకు ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. కేరళ మార్గం అనుసరణీయం.

# ఆ నవ్వులోనే ఉందా ఆ బ్యూటీలో కిక్!

కెరీర్ ప్రారంభించి రెండు దశాబ్ధాలకు చేరువలో ఉన్నా చిండ్రాగదా సింగ్ ఇంకా నత్తకనడనే సాగుతోంది. బాలీవుడ్ లో సినిమాలు చేస్తోంది అంటే చేస్తోంది అనుకోవడం తప్ప అమ్మడి పేరు ఇంతవరకూ మార్మోగింది లేదు. గ్యాప్ లేకుండా ఏడాదికి ఒక సినిమా చేస్తున్నా? చిత్ర సౌండింగ్ మాత్రం ఎప్పుడూ మిస్సింగ్ గా అనిపిస్తుంది. గత ఏడాది 'గ్యాస్ లైట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. %ూ%ఏడాది అనంతరం ఇటీవలే 'ఖేల్ ఖేల్ మే'తోనూ అలరించే ప్రయత్నం చేసింది. అది కూడా ప్లాప్ చిత్రంగానే మిగిలి పోయింది. ఇలా అమ్మడి కెరీర్ సోసోగా సాగుతోంది. మరి కొత్త ప్రాజెక్ట్ గురించి చెప్పడానికి ఎంత సమయం పడుతుందో చూడాలి. ఇక సోషల్ మీడియాలో కూడా చాలా రేర్ గానే ఫోటోలు పోస్ట్ చేస్తుంది. ఇన్ స్టా మీద ఆసక్తి తగ్గిందో? ఎందుకొచ్చిన తలబొబ్బి అని సైలెంట్ అయిందో ఈ మధ్య కాలంలో అయితే అమ్మడు ఏమాత్రం యాక్టివ్ గా కనిపించలేదు. తాజాగా చాలా గ్యాప్ తర్వాత అమ్మడు వింటేజ్ గ్లామ్ అంటూ ఓ హాట్ ఫోటోతో నెటి జనుల ముందు కొచ్చింది. ఇదిగో ఇక్కడిలా వైట్ కలర్ ఔట్ ఫిట్ లో అమ్మడు బిగుసుకుపోయింది. క్లీవేజీ బ్యూటీని హైలైట్ చేస్తూ అగ్గిరాజేసింది. ఐబ్రోస్... మ్యాకప్... పెదాలకు పూసిన లిప్ స్టిక్ అన్ని ఓవర్ గానే ప్రాజెక్ట్ అవుతు న్నాయి. డ్రెస్ మ్యాచింగ్ చెవులకు దిద్దులు..యాక్సరసీస్ ప్రతీది అమ్మడి అందాన్ని మరింత హైలైట్ చేసాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. సొసగరి బ్యూటీకి యువత ఫిదా అవుతుంది. లుక్స్ గార్జియస్.. బ్యూటీఫుల్ లేడీ అంటూ పొగిడేస్తున్నారు. లవ్ సింబల్స్ పోస్ట్ చేసి ప్రపోజల్స్ వర్షం కురిపిస్తున్నారు. చిత్రపై ఎటాకింగ్ అంటే? ఎప్పుడూ ఇలాగే ఉంటుందని మరోసారి ప్రూవ్ చేస్తున్నారు.



# రాజ్ తరుణ్ 'భలే ఉన్నాడే'.. ట్రైలర్ ఎలా ఉందంటే?




టాలీవుడ్ యంగ్ హీరో రాజ్ తరుణ్.. కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. లావణ్య అనే యువతి.. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుని కాపురం చేశారని, ఇప్పుడు వదిలేశారని ఆరోపణలు చేసింది. అబార్షన్ కూడా చేయించారని ఆరోపించింది. రోజుకో మలుపు తిరిగిన ఆ వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. అయితే సినిమా విషయంలో మాత్రం ఫుల్ జోష్ మీద ఉన్నారు రాజ్ తరుణ్. వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇప్పుడు మరో సినిమాతో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. భలే ఉన్నాడే మూవీతో రానున్నారు. శివ సాయి వర్ధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్ వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. రాజ్ తరుణ్ సరసన మనీషా కంద్కూర్ హీరోయిన్ గా నటిస్తోంది. లవ్ అండ్ ఫన్ ఎంటర్టైనర్ గా రూపొందిన భలే ఉన్నాడే మూవీ సెప్టెంబర్ 7వ తేదీన విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, ఫస్ట్ గ్లింప్స్ .. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అదే జోష్ తో రిలీజ్ చేసిన టీజర్ కూడా ఆకట్టుకుంది. ఇంతకుముందు ఇలాంటి కథతో ఎలాంటి సినిమా రాలేదని టీజర్ చూసి చెప్పేయొచ్చు. సినిమాలో రాజ్ తరుణ్ చీర కట్టే వృత్తి చేస్తాడని, గే అని టీజర్ ద్వారా తెలుస్తోంది. అయితే తాజాగా భలే ఉన్నాడే మూవీ ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. హీరో హీరోయిన్లు కలిసి చక్కర్లు కొడుతున్న షాట్స్ తో ట్రైలర్ ప్రారంభమైంది. హీరోను టెంప్ట్ చేయాలని హీరోయిన్ ట్రై చేస్తుంటుంది. ఆ తర్వాత అతడిని తన బుట్టలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. అనంతరం ట్రైలర్ ఒక్కసారిగా ఎమోషనల్ మోడ్ లోకి వెళ్ళిపోయింది. హీరోయిన్ పేరెంట్స్.. హీరో తాలుకా వాళ్లను నిందించడం, హీరో తనకు జీవితం వద్దని అరవడం.. అలా ఆసక్తి రేపే సీన్స్ ను చూపించారు మేకర్స్. ట్రైలర్ సరైన రీతిలో కట్ చేసి మూవీపై అంచనాలు పెంచారు. అయితే రాజ్ తరుణ్ యాక్టింగ్ ఇంప్రెసివ్ గా ఉంది. మనీష తన అందం అండ్ అభినయంతో అలరిస్తోంది. హైపర్ ఆది కామెడీ టైమింగ్ అదిరిపోయింది. ఎమోషనల్ టచ్ కూడా బాగానే ఉన్నట్లు కనిపిస్తోంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ ఫ్రెష్ అండ్ సరిగ్గా సెట్ అయింది. విజువల్స్ రిచ్ గా ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్.. మెప్పిస్తోంది. మరి ఈ సినిమాతో రాజ్ తరుణ్ ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.


# వెట్టేయాన్ వేటకు తేదీ ఫిక్సైంది

సూపర్ స్టార్ రజనీకాంత్ 170వ చిత్రం రిలీజ్ పై కొన్ని నెలలుగా ఉత్కంఠ నెలకొన్న సంగతి తెలిసిందే. రజనీ పార్ట్ షూటింగ్ పూర్తయిన రిలీజ్ తేదీపై క్లారిటీ రాలేదు. దీంతో అభిమానుల్లో రిలీజ్ పై ఆసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారమే అప్ డేట్ ఇస్తామంటూ యూనిట్ రివీల్ చేసింది. తాజాగా కొద్ది సేపటి క్రితమే రిలీజ్ తేదీని అధికారికంగా ప్రకటించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ప్రకటించింది. నేటితో రిలీజ్ సస్పెన్స్ కి తెర పడింది. అంటే రిలీజ్ కి ఇంకా రెండు నెలలు సమయం ఉంది. ఈ గ్యాప్‌లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయనున్నారు. అలాగే ప్రచారం పనులు మొదలు పెడతారని తెలుస్తోంది. ఇంతవరకూ సినిమాకి సంబంధించి గ్లింప్స్ ఏవీ రిలీజ్ కాలేదు.ఫస్ట్ లుక్ పోస్టర్ మినహా క్రేజీ అప్ డేట్స్ ఏవీ రాలేదు. తాజాగా రిలీజ్ తేదీ తో పాటురజనీ కొత్త పోస్టర్ కూడా రిలీజ్ చేసారు. పోస్టర్ లో రజనీ పోలీస్ గెటప్ లో కనిపిస్తున్నారు. రజనీ లుక్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఇకపై యూనిట్ సినిమాని జనాల్లోకి వీలైనంత వేగంగా తీసుకెళ్లె ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే లైకా ప్రొడక్షన్స్ లో రజనీ మూడు సినిమాలు చేసిన సంగతి తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో 2.0 ని ఇదే సంస్థ నిర్మించింది. అలాగే మురగదాస్ దర్శకత్వంలో దర్బార్ కూడా నిర్మించింది.ఆ మధ్య రిలీజ్ అయిన లాల్ సలామ్ కూడా ఇదే సంస్థ నుంచి రిలీజ్ అయింది. కానీ ఇవేవి ఆ సంస్థకు భారీ లాభాలు తెచ్చి పెట్టలేదు. దీంతో సూపర్ స్టార్ వెట్టేయాన్‌తో అన్ని లెక్కలు సరిచేయాలని మరోసారి అదే సంస్థతో ముందుకెళ్తున్నారు. జైభీమ్ విజయంతో టి.జె జ్ఞాన్ వేల్ పేరు పాన్ ఇండియాలో ఫేమస్ అయింది. ఓటీటీలో రిలీజ్ అయినా ఆసినిమాకి మంచి సక్సెస్ అయింది. దీంతో వెట్టేయాన్ పై పాన్ ఇండియాలో అంచనాలు అంతకంతకు రెట్టింపు అవుతున్నాయి. ఇందులో రజనీతో పాటు అమితాబచ్చన్, ఫహాద్ పాజిల్, రానా దగ్గుబాటి లాంటి స్టార్ హీరోలు కూడా భాగమవ్వడం విశేషం.




# ఆకాష్ జగన్నాథ్ పదునైన తల్వార్!

ఆకాష్ పూరి సినిమా చేసి రెండేళ్లు అవుతుంది. చోర్ బజార్ ఫ్లాప్ తర్వాత ఆకాష్ టాపిక్ ఇండస్ట్రీ లే వినిపించలేదు. ఇటీవల రిలీజ్ అయిన డాడ్ సినిమా డబుల్ ఇస్మార్ట్ సైతం ఆశించిన ఫలితాలు సాధించడం లేదు. దీంతో పూరి అండ్ కో అంతా ఫ్లాప్ ల మయం అన్నట్లు హైలైట్ అవుతుంది. పూరి తదుపరి ఏ హీరోతో సినిమా చేస్తారు? అన్నది క్లారిటీ లేదు. ఓ సినిమా సెట్స్ లో ఉండగానే మరో సినిమా లాక్ చేసే పూరి ఇప్పుడు ఆ పరిస్థితుల్లో కనిపించలేదు. దీంతో కొన్ని గంటల క్రితమే అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తానంటూ ఆకాష్ ఓ వీడియో రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓ మంచి సినిమాకి సైన్ చేసినట్లు రివీల్ చేసాడు. తాజాగా నేడు ఆకాష్ పుట్టిన రోజు సందర్భంగా ఆ ప్రాజెక్ట్ వివరాలు అధికారికంగా వెల్లడించారు. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా పంచుకున్నారు. పోస్టర్ లో ఆకాష్ లుక్ అదిరిపోయింది. డ్యాషింగ్ డైరెక్టర్ సన్ అనిపించాడు. తల్వార్ లానే పదునుగా కనిపిస్తున్నాడు. ఆకాష్ షర్ట్ పై రక్తం , పవర్ ఫుల్ ఐస్ ఆకాష్ పాత్రని హైలైట్ చేస్తుంది. ఈ సినిమాకి తల్వార్ అనే టైటిల్నిర్ణయించారు.




గెట్ రెడీ ఫర్ బ్లడ్ బాత్ అంటూ పవర్ ఫుల్ కొటేషన్ జనాల్లోకి వదిలారు. టైటిల్స్ కార్డ్స్‌లో ఆకాష్ పేరు కూడా మారేలా కనిపిస్తోంది. పోస్టర్ లో ఆకాష్ జగన్నాథ్ ఇన్ అని వేసారు. జగన్నాథ్ తండ్రి పేరు. ఇప్పుడు కుమారుడు ఇంటి పేరుకి బధులు తండ్రి పేరు యాడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో కాశీ పరశురాం అనే కొత్త కుర్రాడు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈఎల్ వీ భాస్కర్ సమర్పిస్తున్నారు. స్టూడియోస్ వార్నిక్ సంస్థ నిర్మిస్తుంది. కేశవ్ కిరణ్ సంగీతం అందిస్తున్నాడు.

త్రిలోక్ సిద్దు డివోపీగా పని చేస్తున్నాడు. సినిమా ప్రారంభోత్సవం ఎప్పుడు ఉంటుంది? రెగ్యులర్ షూటింగ్ ...రిలీజ్ తేదీలు వంటి వివరాలు త్వరలో తెలియనున్నాయి.

# స్లీవ్ లెస్ ఫ్రాకులో బ్యూటిఫుల్ సయీ



అడివి శేష్ సరసన మేజర్ అనే పాన్ ఇండియా చిత్రంలో నటించిన సయీ.. హిందీ పరిశ్రమలో దబాంగ్ 3తో తెరంగేట్రం చేసింది. నటుడు, దర్శకుడు మహేశ్ మంజ్రేకర్ వారసురాలిగా కెరీర్ ప్రారంభమైనా తనకంటూ ఒక ప్రత్యేకత ఉందని చాటుకోవడం కోసం సయీ చాలా హార్డ్ వర్క్ చేస్తోంది. ప్రస్తుతం తెలుగు తమిళం సహా హిందీలో అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. తాజాగా సయీ బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ ఫ్రాకులో కనిపించింది. విభిన్నమైన హావభావాలు ప్రదర్శిస్తూ సయీ ఫోటోషూట్ లో పాల్గొంది. ఈ ఫోటోగ్రాఫ్స్ లో సయీ ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఇవన్నీ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. వృత్తిగతంగా చూస్తే.. అగ్రహీరో అజయ్ దేవగన్ తో కలిసి ఔరాన్ మే కహన్ దమ్ థా (అనువాదం. వేర్ డిడ్ అదర్స్ హావ్ ద కరేజ్) లో నటించింది. నీరజ్ పాండే దర్శకత్వం వహించిన రొమాంటిక్ థ్రిల్లర్ లో దేవగన్, టబులకు జంటగా పదో సినిమా. జిమ్మీ షీర్‌గిల్, శాంతను మహేశ్వరి- సాయి మంజ్రేకర్ ఇందులో కీలక పాత్రలు పోషించారు. వీ. వీ. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఇటీవలే ఈ సినిమా విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది.